క్లుప్తంగా

మద్ది అంజన్నకు పూజలు



మద్దిక్షేత్రంలో బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: మద్ది క్షేత్రంలో మంగళవారం సందర్భంగా స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యార్చన పూజలు చేశారు. అంజన్న ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు ఈఓ ఆర్వీ చందన తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం వరకు వివిధ సేవలు, విరాళాల రూపేణా ఆలయానికి రూ.1,77,837 ఆదాయం వచ్చిందన్నారు. స్వామి వారి అన్నదాన సత్రంలో సుమారు 1200 మంది అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు. కార్యక్రమాలను కురగంటి రంగారావు పర్యవేక్షించారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులకు రక్తం అవసరమని తెలియడంతో విద్యార్థులు ఎల్ వెంకట అరవింద్, పి.గంగాధర్‌లు ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్‌బాబు, వి.హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మట్టా మధు, రెడ్‌రిబ్బన్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

ఆత్మీయ సమావేశానికి తరలిన శ్రేణులు



ఏలూరుకు తరలి వెళ్తున్న తెల్లం బాలరాజు, పార్టీ శ్రేణులు

కొయ్యలగూడెం: ఏలూరులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అని రంగాల్లోనూ విఫలమై ప్రజాగ్రహాన్ని చవిచూస్తోందని వివరించారు. ఎన్నికల హామీల అమలుకు ప్రజలను కలుపుకొని ఉద్యమించనున్నట్టు చెప్పారు. ఏలూరు వెళ్లిన వారిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు, మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీపీ గంజి మాల రామారావు, నాయకులు సంకుకొండ, దూలపల్లి కాంతారావు, కంభంపాటి బుజ్జిబాబు, చిడిపి రవి, ఏలేటి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

మంగళ్ పాండేకు నివాళి



ఎంపీయూపీ స్కూల్లో పాండేకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: సిపాయిలు తిరుగుబాటు సంగ్రామ యోధుడు మంగళ్ పాండే వర్ధంతి సందర్భంగా మంగళవారం మండలంలోని కుంతలగూడెం ఎంపీయూపీ స్కూల్లో పాండే చిత్రపటం వద్ద విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ మాట్లాడుతూ పాండే స్ఫూర్తిగా తీసుకొని ఝాన్సీ రాణి, తాంతియాతోపే వంటి స్వాతంత్ర సమరయోధులు సిపాయిల తిరుగుబాటు నేతృత్వం వహించి చరితార్థులయ్యారన్నారు. సిపాయిల తిరుగుబాటు వల్ల ఈస్ట్ ఇండియా కంపెనీ అంతమై బ్రిటీష్ ప్రభుత్వం పాలనలోకి వచ్చిందని వివరించారు.

చలివేంద్రాల ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ విజయదుర్గ తదితరులు

పోలవరం రూరల్: కొత్త పట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధిలో పలు కూడళ్లల్లో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, ఉప సర్పంచ్ రంభ శ్రీనివాస్, కార్యదర్శి విజయలక్ష్మిలు మంగళవారం ప్రారంభించారు. విజయదుర్గ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ఆంజనేయస్వామి గుడి దగ్గర (బస్ స్టాప్), కనకదుర్గమ్మ గుడి వద్ద, గూటాల పంపింగ్ స్కీమ్ వద్ద చలివేంద్రాలను ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ఏడాదీ సాగునీటి కష్టాలు తప్పవా?

- ఆంధ్రా కాల్వ మరమ్మతులపై నిర్లక్ష్యం
- రైతుల ఆందోళన

చింతలపూడి: ఆంధ్రా కాల్వకు మరమ్మతులు చేపట్టక పోవడంతో ఈ ఏడాది సాగునీటి కష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మెరక తేలి పూడిక, ముళ్ల పొదలతో పూడుకుపోయిన ఆంధ్రా కాల్వ కొంత కాలానికి కనుమరుగు అవుతుందేమోనని వాపోతున్నారు. చింతలపూడి మండలంలోని 21 చెరువులకు సాగు నీరు అందించడానికి ఖమ్మం జిల్లా తుమ్మూరు వద్ద ఆనకట్ట నిర్మించారు. అక్కడి నుంచి వరద నీటిని సాగు నీటి చెరువులకు మళ్లిస్తారు. 1967లో 18 కిలో మీటర్ల పొడవున కాల్వ తవ్వారు. దీంతో చింతలపూడి మండలంలో దాదాపు 11 వేల ఎకరాలకు ఏటా సాగునీరు అందుతుంది. అయితే అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఆంధ్రా కాల్వ పూడుకుపోయి సాగు నీటి సరఫరాకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న ఈ కాల్వకు వర్షాకాలంలో అనేక సార్లు గండ్లు పడటం, మరమ్మతులు



గణిజర్ల గ్రామం వద్ద ఆంధ్రా కాల్వ దుస్థితి



చింతకాయల కొత్తగూడెం వద్ద ముళ్ల పొదలతో నిండిన ఆంధ్రాకాల్వ

చేయడం ఆనవాయితీగా మారింది. గతంలో చింతలపూడి మండలం గణిజర్ల గ్రామం వద్ద ఆంధ్రాకాల్వకు అనేక సార్లు గండ్లు పడ్డాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు గండి పూడ్చివేతలో రూ.లక్షలు దండుకుంటున్నారే తప్ప, శాశ్వత చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వేసవిలో నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టకపోతే ఆంధ్రా కాల్వ నుంచి వచ్చే వరదనీరు వృథాగా పోతుందని ఆందోళన చెందుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, ఆంధ్రకాల్వ పూడిక తీత పనులను చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ఆంధ్రా కాల్వ మరమ్మతులకు నిధులు కేటాయించాలి. తుపానుకు పడ్డ గండిని పూడ్చి, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలి. వరదలు వస్తే గండిని పూడ్చక పోవడం వల్ల వరద నీరు పొలాలపై ప్రవహించి, వృథాగా పోతుంది.

– గడ్డి ప్రసాద్, రైతు, యండపల్లి

గ్యాస్, పెట్రో ధరల పెంపుపై ఆగ్రహం

వేలేరుపాడు: పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం భూదేవిపేట గ్రామంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండీ మునీర్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచటం వల్ల అన్ని నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయని అన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని, లేకుంటే మరిన్ని పోరాటాలను ప్రభుత్వం ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యర్రా మధు, నాయకులు మడివి కామయ్య, కురిమెళ్ల వెంకటేశ్వర్లు, సోడే కన్నరావు, కారం ముత్యాలరావు, కట్టి రాంబాబు, కరక ముత్యాలు, సోడే మారయ్య, సరియం నాగులు పాల్గొన్నారు.



వేలేరుపాడు : భూదేవిపేటలో ధర్నా చేస్తున్న నాయకులు



బుట్టాయగూడెం : నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: కేంద్రం పెంచిన గ్యాస్, ఆయిల్ ధరలపై సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కొయ్యలగూడెంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు పేదలకు భారమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే పెంచిన ధరలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టౌన్ సెక్రెటరీ ఎస్‌కే బాజీ, వెలగల నాని, మట్ట రామకృష్ణ, రాంబాబు, కార్పెంటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: పెట్రో, గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో కుక్కునూరు ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని సీపీఐ కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబురావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం: గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపును వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఒక మహిళా కార్యకర్త తలపై సిలిండర్ పెంచిన చార్జీలను తగ్గించాలని నినదించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.50 పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తెల్లం రామకృష్ణ, చంద్రు బుల్లెమ్మ, సోయం శ్రీనివాస్, మడకపాటి అనూష, మరియమ్మ, పంతులమ్మ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చింతలపూడి : మండలంలోని రాఘవాపురం రైతు సేవ కేంద్రంలో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగ కుమార్ మాట్లాడుతూ మండలంలో 4,410 ఎకరాల్లో రబీ వరి సాగు చేయగా, సుమారు 13,250 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందన్నారు. క్వింటాల్ కామన్ రకానికి రూ.2,300, ఏ గ్రేడ్‌కు రూ.2,320 ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జె.ముత్తారెడ్డి, మాటూరి వెంకట రామయ్య, చీదరాల మధుబాబు, మండల వ్యవసాయ అధికారి మీనా కుమారి, సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ విజయకుమారి, రాఘవపురం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎస్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



రాఘవాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

సేంద్రియ ఎరువులదే భవిష్యత్తు

కొయ్యలగూడెం: భవిష్యత్తులో రైతులు ఏ పంటలు పండించాలన్నా సేంద్రియ ఎరువులదే అగ్రస్థానమని వాటిపైనే ఆధారపడక తప్పదని ఏడీఏ పీజీ బుజ్జిబాబు అన్నారు. మంగళవారం బయ్యన్నగూడెంలో రైతు సాధికారిక సంస్థ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సేంద్రియ ఎరువులపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. సాయికృష్ణ గోశాల ప్రకృతి ఉత్పత్తుల శిక్షణా కేంద్రం వద్ద నవ ధాన్యాలు తయారు చేసే విధానంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. డీపీఎం వెంకటేశ్వరరావు గోశాలలో తయారవుతున్న సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. కేఆర్‌పురం డివిజన్‌లో 10 వేల ఎకరాల్లో 10 వేల కిట్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను రక్షించగల శక్తి సేంద్రియ ఎరువులకు ఉందన్నారు.



బయ్యనగూడెంలో సేంద్రియ ఎరువులను రైతులకు పంపిణీ చేస్తున్న ఏడీఏ బుజ్జిబాబు

పోషకాహారం తీసుకోవాలి



పొంగుటూరులో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పొంగుటూరు ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులకు ఆరోగ్యం, రక్షణపై అవగాహన కల్పించారు. గర్భిణులలో పెరుగుదల పర్యవేక్షణ, చిన్నారుల పెరుగుదలకు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పోషణ లోపం వల్ల ఎదుర్కొనే సమస్యలు అనారోగ్య పరిస్థితులపై మాట్లాడారు. పోషకాహారం తీసుకోవడం అవసరమని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, కిశోర బాలికలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

మేడే కరపత్రం విడుదల

కుక్కునూరు: మేడేను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో మేడే కరపత్రం విడుదల చేశారు. బాడిస సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయికిరణ్ మాట్లాడారు. కార్మిక చట్టాలపై అవగాహనకు ఏప్రిల్ 26, 27 తేదీల్లో దాచారం గ్రామంలో నిర్వహించే అవగాహన కార్యక్రమానికి కార్మికులు హాజరవ్వాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు షేక్ వలీపాషా, నాయకులు ఎండీ వలీపాషా, రాయి రమణ, బురం శ్రావణి, రమణ, కుమారి, కణితి మంగ, వర్స మంగ, దుర్గమ్మ, పార్వతి, అన్నపూర్ణ, స్రవంతి, ఇరకం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేసిన నాయకులు

10న వంతెన కోసం పాదయాత్ర

జంగారెడ్డిగూడెం: పట్టిన్నపాలెం వంతెన నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 10న నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జంగారెడ్డి మండల కార్యదర్శి ఎం జీవరత్నం కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పట్టిన్నపాలెంలో వంతెన బుట్టాయిగూడెం మండలం గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే ప్రధాన రహదారిగా ఉందని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం గత టీడీపీ ప్రభుత్వం 2014లో పనులు సంగం చేసి ఆపేసిందని వివరించారు. వాగు పొంగి ఇప్పటి వరకు ఎనిమిది మంది మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు. ఈ నెల 10న పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శి వర్గ సభ్యులు టి.రామకృష్ణ, టి.నాగమణి ఆధ్వర్యంలో పట్టిన్నపాలెం వంతెన నుంచి జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయం వరకు 100 మందితో పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

వేలేరుపాడు: పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పందా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితులతో కలిసి వారు ఆందోళన చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన రూ.6 లక్షలకు వడ్డీ కట్టి ఇవ్వాలని, వేలేరుపాడు మండలం మొత్తం యూనిట్‌గా తీసుకొని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గద్దల ముత్యాలరావు కట్ల వీరస్వామి, సర్పంచ్‌లు కట్టడం రాంబాబు, మడి రంగమ్మ, సోడా విజయ, ఎంపీటీసీ సభ్యులు కతం రత్తమ్మ, తరం తమ్మయ్య, డివిజన్ నాయకులు కారం సత్యవతి, కారం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

విద్యుత్ ఉద్యోగులకు కంటి పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ సంస్థ ఉద్యోగులు ఆరోగ్యం కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు తెలిపారు. విద్యుత్ సంస్థలో ఏలూరు సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు స్థానిక విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ ప్రతినిధులు ఉద్యోగులకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగ సంఘ నాయకులు తురగా రామకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించి తమ ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకుంటున్న ఎస్ఈ సాల్మన్ రాజుకు, సర్కిల్ మేనేజ్మెంట్‌కు ఉద్యోగుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు భూక్యా నాగేశ్వరరావు, ఎం రమేష్, వి.రాము, పి.శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, ఎస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక సీతా రామస్వామి (వైకుంఠ రాముడు) కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. సీతా లక్ష్మణ హనుమ సమేత రామచంద్రులను అశ్వవాహనంపై పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, కేరళ డ్రమ్స్, వివిధ రకాల వేషధారణల నడుమ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రజలు స్వాగతం పలికి, స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. మంగళవారం మధ్యాహ్నం ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.



జంగారెడ్డిగూడెంలో సీతారామస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

భారీ అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: స్థానిక వెలమ రామాలయం వద్ద పట్టణ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన భారీ అన్నసమారాధనను సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజాన సత్యనారాయణ (పండు), చిన్ని రామ సత్యనారాయణ, గొట్టుముక్కల వంశీ కుమార్ రాజు తదితరులు ప్రారంభించారు. సుమారు ఆరు వేల మందికి అన్నసమారాధన నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీరామనవమి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన సంఘం అధ్యక్షుడు భీమిరెడ్డి జోగిబాబు, సభ్యులు, తాండ్రపాపారాయుడు యూత్ సభ్యులు, సేవా బృందం సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

10న బుట్టాయగూడెంలో ఉచిత క్యాన్సర్ శిబిరం

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఈ నెల 10వ తేదీన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు మాజీ ఎంపీటీసీ సభ్యులు, న్యాయవాది ఉద్దండం ఏసుబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆత్మబంధువులం స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ గ్రేస్ ఫౌండేషన్ సహకారంతో సంయుక్తంగా ఈ శిబిరం ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. క్యాన్సర్ ప్రారంభ దశలో తెలుసుకోలేకపోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. సుమారు రూ.7 వేల వరకు ఖర్చు అయ్యే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మోడల్ స్కూల్‌గా మార్పు చేయండి

టి.నరసాపురం: బొర్రంపాలెంలోని ఎస్సీ పాతపేట స్కూల్‌ను మోడల్ స్కూల్‌గా మార్పు చేయాలని బొర్రంపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం కోరింది. ఈమేరకు మంగళవారం ఎంఈఓ టి.రామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న స్కూల్‌ను మోడల్ స్కూల్‌గా మార్చే ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో ఎస్సీ పాతపేట స్కూల్‌ను మోడల్‌స్కూల్‌గా మార్చాలని కోరారు. కార్యక్రమంలో గుండె పాండురంగ, గుండె గణపతి, గుండె నాగేంద్ర తదితరులు ఉన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ బస్సు మోటార్ సైకిలిస్టును ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలు ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణంలో సెల్‌ఫోన్ మెకానిక్ షేక్ అహ్మద్ షరీఫ్ ఈ నెల 6న సాయంత్రం తన స్నేహితుడిని గుర్వాయిగూడెంలో దించి, తిరిగి జంగారెడ్డిగూడెం వస్తుండగా స్థానిక సాయిబాబ స్థూపం వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. షరీఫ్ తలకు బలమైన గాయమవడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, షరీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సారా స్థావరంపై దాడి



బెల్లపు ఊటను ధ్వంసం చేయిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని పంగిడిగూడెంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. 10 లీటర్ల సారా కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ ఎస్సై కె.మహమ్మద్ ఆరీఫ్, జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న మానవత సభ్యులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం కనుమూరి స్వామినాథం, దుర్గా దంపతుల ఇల్లు దగ్ధమైంది. వారు కట్టుబట్టలతో బయట పడ్డారు. వారికి మానవత సంస్థ కార్యవర్గ సభ్యులు మంగళవారం నెలకు సరిపడా నిత్యావసరాలు, దుస్తులు, రూ.3 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో మానవత ఉపాధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.